పట్టణ సమస్యలపై నివేదించండి

పెద్దపల్లి మున్సిపల్ కమిషనర్‌తో ఫోన్-ఇన్ నేడు

ఈనాడు ఊతోడు



పెద్దపల్లి పురపాలక సంఘం పరిధిలో పారిశుద్ధ్య నిర్వహణ, తాగునీటి సరఫరా, రహదారులు, వీధి దీపాలు తదితర అంశాలకు సంబంధించి సమస్యలున్నాయా..! వీటితో పాటు మున్సిపల్ పరిధిలోని ఇతర అంశాలను అధికారులు దృష్టికి తీసుకెళ్లేందుకు 'ఈనాడు' మీకు అవకాశం కల్పిస్తోంది. మీ సమస్యను ఫోన్ ద్వారా కమిషనర్ ఆకుల వెంకటేశ్‌కు వివరించండి.

-న్యూస్‌టుడే, పెద్దపల్లి

ఫోన్ నంబరు : 80085 73656

సమయం : బుధవారం మధ్యాహ్నం 12 గంటల నుంచి 1 గంట వరకు.

పౌర సరఫరాల గోదాం తనిఖీ



బియ్యాన్ని పరిశీలిస్తున్న ఆర్డీవో హనుమానాయక్

మంథని, న్యూస్‌టుడే: మంథని పట్టణంలోని పౌర సరఫరాల గోదామును ఆర్డీవో హనుమానాయక్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టాక్ రిజిస్టరును పరిశీలించి, గతంలో సీజ్ చేసిన బియ్యాన్ని తనిఖీ చేశారు. ఆర్వోల ప్రకారం సకాలంలో డీలర్లకు సరఫరా చేయాలని గోదాం ఇన్‌ఛార్జి నాగారాజును ఆదేశించారు. తూకం చేసిన తర్వాతే బియ్యాన్ని అప్పగించాలన్నారు.

తాళం చూసి.. కన్నం వేసి!



● ఎన్టీపీసీ కృష్ణానగర్‌లోని ఓ ఇంట్లో ఈ నెల 19న 9 తులాల బంగారు, కిలో వెండి ఆభరణాలతో పాటు రూ.1.5 లక్షల నగదు చోరీకి గురైంది. ఇంట్లో ఎవరు లేరని గుర్తించిన గుర్తుతెలియని వ్యక్తులు మాటువేసి అపహరించారు.

● పెద్దపల్లి పట్టణంలోని లక్ష్మీనగర్‌లో తాళం వేసిన ఇంట్లో ఈ నెల 22 రాత్రి చోరీ జరిగింది. అమ్మాయి వివాహం కోసం ఇంట్లో దాచిన 13 తులాల బంగారం, 5.5 తులాల వెండి ఆభరణాలను దొంగలు ఎత్తుకెళ్లారు. బాధితులు బంధువుల ఇంట్లో వేడుకకు వెళ్లినప్పుడు ఈ ఘటన చోటుచేసుకుంది.

న్యూస్‌టుడే, గోదావరిఖని

తాళం వేసిన ఇళ్లే లక్ష్యంగా దొంగలు చోరీలకు పాల్పడుతున్నారు. ఇటీవల జిల్లాలో ఇలాంటి ఘటనలు పెరిగాయి. దుండగులు ఆలయాలను కూడా వదలడం లేదు. గతంలో వరుస చోరీలు జరగ్గా పోలీసులు నిఘా పెంచారు. కానీ తాజాగా మళ్లీ దొంగలు రెచ్చిపోతున్నారు. 2022లో 233, 2023లో 256 దొంగతనాల కేసులు నమోదు కాగా.. 2024లో ఇప్పటి వరకు 240 అయ్యాయి. పట్టణ ప్రాంతాల్లో జన సందడి ఎక్కువగా ఉండటంతో ఎవరికి అనుమానం రాకుండా దొంగలు ఇళ్లను ముందుగానే పరిశీలించి రాత్రి వేళల్లో పని కానిస్తున్నారు. రామగుండం

ఆలయాలనూ వదలని దొంగలు



ఎన్టీపీసీ కృష్ణానగర్‌లో చోరీ జరిగిన ఇంట్లో.. (పాతచిత్రం)

జిల్లాలో జరిగిన చోరీలు	
సంవత్సరం	చోరీలు
2022	233
2023	256
2024 (ఇప్పటివరకు)	240

పట్టణంతో పాటు లక్ష్మీపురం గ్రామాల్లోని పలు ఆలయాల్లో విలువైనా ఆభరణాలు అపహరణకు గురయ్యాయి.

పాత నేరస్థులపై అనుమానాలు

గతంలో చోరీలకు పాల్పడి జైలుకు వెళ్లిన నేరస్థులపై పోలీసులు నిఘా ఉంచారు. ప్రస్తుతం జరిగిన దొంగతనాల తీరు.. విధానాలను క్లూస్‌టీం ద్వారా సేకరించిన ఆధారాలతో వారిపై నిఘా పెంచారు. కొన్ని కేసుల్లో పాత నేరస్థులే ఇటీవల చోరీలకు పాల్పడ్డట్లు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. జైలు నుంచి బెయిల్‌పై వచ్చిన పాత నేరస్థులు సాధారణ జీవితం గడుపుతున్నారా.. మళ్లీ నేరాలకు పాల్పడుతున్నారా అన్న విషయాలపై పోలీసులు ఆరా తీస్తున్నారు. ఈ మేరకు ప్రస్తుతం జిల్లాలో నమోదైన దొంగతనాల కేసులపై విచారణ చేస్తున్నారు.

బయటకు వెళ్తే..

- ఇంటికి తాళం వేసి ఊరికి వెళ్లే సమయంలో పరిధిలోని ఠాణాలో సమాచారం ఇవ్వాలి
- చుట్టు పక్కల వారికి కూడా ఇంటిని గమనిస్తుండాలని చెప్పాలి.
- అవసరమైతే బంధువులను ఇంట్లో ఉంచి వెళ్లాలి.
- ఇంటి ముందు చెత్త పేరుకుపోకుండా శుభ్రం చేయించమని పక్కవారికి చెప్పాలి
- బయటకు తాళం కనిపించకుండా కర్టెన్లు వంటి పెట్టాలి.
- అనుమానితులు కనిపిస్తే పోలీసులకు ఫిర్యాదు చేయాలి.

గస్తీ పెంచుతున్నాం

చోరీల నియంత్రణకు రాత్రి వేళల్లో గస్తీ పెంచుతున్నాం. కొన్ని సంఘటనల్లో నేరస్థులను గుర్తించాం. ప్రజల ఆస్తులకు రక్షణ కల్పించేందుకు ఠాణాల వారీగా అధికారులకు సూచనలు చేశాం. చోరీ చేసిన నిందితులను కూడా పట్టుకుంటాం. గతంలో జరిగిన చోరీల్లో చాలా వరకు నిందితులను గుర్తించాం. సొత్తు కూడా కొంత వరకు రికవరీ చేశాం.

- ఎం.శ్రీనివాస్, రామగుండం పోలీసు కమిషనర్

కొత్త యంత్రాలు.. పాత భవనం



మంథని సామాజిక వైద్యశాలలో ఏర్పాటు చేసిన డయాలసిస్(రక్త శుద్ధి) కేంద్రం సేవలు అందని ద్రాక్షగా మారాయి. పది నెలల కిందట ఆసుపత్రిలోని సీమాంక్(ప్రసూతి) భవనంలో ఒక్కో పడకకు ఒక్కోటి చొప్పున అయిదు యంత్రాలు, ఇతర పరికరాలు బిగించారు. అప్పట్లో కేంద్రానికి విద్యుత్తు సరఫరా సామర్థ్యం సరిపోక సేవలు అందుబాటులోకి రాలేదు. 40 రోజుల కిందట రూ.6 లక్షలతో కొత్త ట్రాన్స్‌ఫార్మర్ మంజూరు చేయగా గత నెల 21న మంత్రి శ్రీధర్‌బాబు డయాలసిస్ కేంద్రాన్ని ప్రారంభించారు. భవనం కప్పునకు లీకేజీలు ఏర్పడి ఇటీవలి వర్షాలకు ఉరిసింది. ఒక్కో యంత్రం రూ.10 లక్షల విలువైనది కావడంతో పాడవుతాయని సేవలను అందుబాటులోకి తేలేదు. 'భవనం మరమ్మతుకు ప్రభుత్వం రూ.2 లక్షలు మంజూరు చేసింది. పదిహేను రోజుల్లో పనులు పూర్తవుతాయి. త్వరలోనే డయాలసిస్ సేవలను అందుబాటులోకి తెస్తాం' అని ఆసుపత్రి పర్యవేక్షకుడు రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. -న్యూస్‌టుడే, మంథని

వైమానిక దళంలో అవకాశాలపై అవగాహన 26న

పెద్దపల్లి కలెక్టరేట్, న్యూస్‌టుడే: భారత వైమానిక దళంలో ఉద్యోగావకాశాలపై ఈ నెల 26న ఇంటర్మీడియట్, డిగ్రీ విద్యార్థులకు పెద్దపల్లి స్వరూప గార్డెన్‌లో అవగాహన సమావేశం నిర్వహించనున్నట్లు ఇంటర్ నోడల్ అధికారి కల్పన ఓ ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి కలెక్టర్ శ్రీహర్ష హాజరవుతారన్నారు. 17.5 ఏళ్ల నుంచి 21 ఏళ్ల లోపు వయసున్న విద్యార్థులు అర్హులని, బాలురు 152.5 సెం.మీ, బాలికలు 152 సెం.మీ ఎత్తుండాలని సూచించారు.

ఎంబీబీఎస్‌లో 92 శాతం ఉత్తీర్ణత

గోదావరిఖని పట్టణం, న్యూస్‌టుడే: గోదావరిఖని ప్రభుత్వ వైద్య కళాశాల మొదటి సంవత్సరం ఎంబీబీఎస్‌లో 92 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ నరేందర్ తెలిపారు. మొత్తం 149 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా 142 మంది ఉత్తీర్ణులయ్యారని, అందులో 67 మంది ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణులు కాగా మిగతా వారు ద్వితీయ శ్రేణిలో ఉత్తీర్ణులయ్యారన్నారు.

మంథని ఆలయాల అభివృద్ధికి ప్రణాళిక

దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజారామయ్యర్



గౌతమేశ్వర ఆలయాన్ని పరిశీలిస్తున్న ముఖ్య కార్యదర్శి శైలజారామయ్యర్, కమిషనర్ హన్మంతరావు, కలెక్టర్ శ్రీహర్ష

మంథని, న్యూస్‌టుడే: మంథని ప్రాంత ఆలయాల అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేయాలని రాష్ట్ర దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజారామయ్యర్ సూచించారు. మంగళవారం ఆమె దేవాదాయ, సమాచార శాఖల కమిషనర్ హన్మంతరావు, కలెక్టర్ శ్రీహర్షలతో కలిసి పట్టణంలో పర్యటించారు. మహాలక్ష్మి, గౌతమేశ్వర ఆలయాలను, పరిసరాలను పరిశీలించారు. అనంతరం మున్సిపల్ కార్యాలయంలో అధికారులతో సమీక్షించారు. కాళేశ్వరం, మంథని, రామగిరి సర్క్యూట్ అభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. కాళేశ్వరంలో గోదావరి తీరాన్ని శుభ్రం చేయడంతో పాటు భక్తుల పుణ్య స్నానాల కోసం షవర్లు, మహిళలకు స్నానాల గదులు ఏర్పాటు చేస్తామన్నారు. మంథనిలో బుద్ధుడి కాలంలోని విగ్రహాలు లభించాయని, ఇక్కడి ఆలయాల అభివృద్ధికి అర్చకులు, అధికారులతో చర్చించి ప్రణాళిక రూపొందిస్తామన్నారు. 2027లో జరిగే గోదావరి పుష్కరాల ఏర్పాట్లపై ప్రణాళిక తయారు చేయాలని అధికారులకు సూచించారు. మంథనిలోని ఆలయాలతో సాంస్కృతిక కారిడార్ ఏర్పాటు దిశగా చర్యలు తీసుకోవాలన్నారు. సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణకు కళాభారతి వంటి భవనానికి స్థలాన్ని ఎంపిక చేయాలన్నారు. కలెక్టర్ శ్రీహర్ష మాట్లాడుతూ గౌతమేశ్వర ఆలయం వద్ద స్నానాల ఘాట్, షవర్లు, స్నానాల గదుల ఏర్పాటుకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నామని చెప్పారు. లైట్‌షో, వాటర్‌షో ఏర్పాటును పరిశీస్తున్నామన్నారు. ఆక్రమణలు తొలగించి మహాలక్ష్మి చెరువులో మురుగు కలవకుండా చర్యలు తీసుకుంటామన్నారు. రామగిరిని పర్యాటక శాఖ పరిధిలోకి చేర్చేందుకు ప్రణాళిక తయారు చేస్తున్నామన్నారు. ఆర్డీవో హనుమానాయక్, అధికారులు పాల్గొన్నారు.

గోదావరి పుష్కర ఘాట్‌పై స్వచ్ఛతా హీ సేవా



చెత్త ఏరుతున్న బల్దియా సిబ్బంది, ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ విద్యార్థులు

గోదావరిఖని పట్టణం, న్యూస్‌టుడే: రామగుండం నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో గోదావరి పుష్కరఘాట్ వద్ద మంగళవారం 'స్వచ్ఛతా హీ సేవా' కార్యక్రమం నిర్వహించారు. నగరపాలిక అధికారులు, సిబ్బంది, గోదావరిఖని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ విద్యార్థులు పాల్గొని నదీ తీరంలో ప్లాస్టిక్ కవర్లు తదితర చెత్తాచెదారాన్ని శుభ్రం చేశారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ జైకిషన్ ఓజా, నగరపాలక కార్యదర్శి రాజు, ఆరోగ్య సహాయకులు సునీల్ రాథోడ్, పర్యావరణ ఇంజినీర్ మధూకర్, ఎం.ఐ.ఎస్. ఆపరేటర్ శ్రీకాంత్ పాల్గొన్నారు.

ఆరోగ్య బీమాతో ధీమాగా..!

- ఉమ్మడి జిల్లాలో 30 శాతం కుటుంబాలకు పాలసీలు
- కరోనా తరవాత పెరిగిన అవగాహన

● గోదావరిఖనికి చెందిన ఏడాది చిన్నారికి తండ్రి వైద్య బీమా చేయించారు. కొద్ది రోజులకే ఆ చిన్నారికి జ్వరం రావడంతో ప్లేట్‌లెట్లు తగ్గాయి. పరిస్థితి తీవ్రంగా ఉండటంతో హైదరాబాద్‌లోని ఓ కార్పొరేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. సమయానికి అందిన వైద్యంతో సురక్షితంగా ఇంటికి చేరుకుంది. చికిత్స ఖర్చు రూ.2 లక్షలు. ఆరోగ్య బీమా ఉండటంతో రూపాయి భారం పడకుండా ఆస్పత్రి బిల్లులు చెల్లించారు.

న్యూస్‌టుడే, గోదావరిఖని

ఇది ఒక ఉదాహరణ మాత్రమే. ప్రస్తుతం ఆరోగ్య బీమాపై అవగాహన పెరగడంతో చాలామంది మధ్య తరగతి, ఎగువ మధ్య తరగతి వారు ఆస్పత్రుల ఖర్చు భారం పడకుండా జాగ్రత్త పడుతున్నారు. కరోనా సమయంలో వైద్య చికిత్సకు రూ.లక్షల్లో బిల్లులు అవడంతో అవగాహన పెరిగి జనం ఆరోగ్య బీమా పాలసీలు తీసుకోవడంపై దృష్టి పెట్టారు. దీంతో ఆ కంపెనీల వ్యాపారం పెరుగుతుండగా.. అనారోగ్య పరిస్థితులు తలెత్తినప్పుడు పాలసీదారులకు ఉపయుక్తంగా మారుతోంది.


● ఉమ్మడి జిల్లాలో 942 ప్రైవేటు ఆస్పత్రులు ఉండగా.. ఇందులో ఇన్ పేషంట్లుగా చేరుతున్న వారిలో 30 శాతం వరకు ఆరోగ్య బీమా పాలసీల ద్వారానే వైద్యం చేయించుకుంటున్నారు. ఇందులో ప్రభుత్వ ఉద్యోగులైతే శాఖాపరంగా వచ్చే బీమా సౌకర్యంతో, ప్రైవేటు ఉద్యోగులు, వివిధ రంగాల వారు తాము చేసుకున్న పాలసీలతో వైద్యం పొందుతున్నారు.

● గతంలో ఆస్పత్రుల్లో చేరితే రూ.లక్షల్లో అప్పు చేయాల్సిన పరిస్థితి ఉండేది. దీంతో మధ్య తరగతి వారు చాలామంది ఆరోగ్య బీమా చేయించుకుని అత్యవసర సమయంలో ఖర్చుల భారం లేకుండా చేసుకుంటున్నారు.

● నిరుపేద కుటుంబాలకు తెల్ల రేషన్ కార్డు ద్వారా ఆరోగ్యశ్రీ, ఆయుష్మాన్ భారత్ వర్తిస్తోంది. ఉమ్మడి జిల్లాలో 30 శాతం మంది వీటి పరిధిలోనే వైద్యం పొందుతున్నారు. ప్రభుత్వ ఉద్యోగులు, ప్రభుత్వ రంగ సంస్థల్లో పనిచేసే వారు ఆయా శాఖల ద్వారా ఆరోగ్య బీమా సౌకర్యం పొందుతున్నారు. ఈ కుటుంబాలు లక్ష వరకు ఉంటాయి. ఇక ఏ అవకాశం లేని కుటుంబాల్లో మరో 30 శాతం మంది ప్రైవేటు సంస్థల ద్వారా బీమా చేయించుకుని వైద్య సేవలు పొందుతున్నారు.

● ఉమ్మడి జిల్లాలో రూ.5 లక్షల పరిమితి వరకు పాలసీలు ఎక్కువ మంది తీసుకుంటున్నారు. 3 లక్షల కుటుంబాలకు ప్రైవేటు బీమా పాలసీలు ఉండగా అందులో దాదాపు రెండు లక్షల కుటుంబాలు రూ.5 లక్షల పరిమితి పాలసీ తీసుకున్నాయి.

● ఏదైనా ఆరోగ్య సమస్య తలెత్తితే డబ్బు కోసం ఇతరులపై ఆధారపడకుండా వెంటనే ఆస్పత్రుల్లో చేరేందుకు బీమా సౌకర్యం ఉపయోగపడుతుందని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.



ఉమ్మడి జిల్లా వివరాలు (సుమారు)

జనాభా : **40 లక్షలు**

కుటుంబాలు : **10 లక్షలు**

ఆరోగ్యశ్రీ, ఆయుష్మాన్ భారత్ పరిధిలోకి వచ్చే కుటుంబాలు : **3 లక్షలు**

ప్రైవేటు సంస్థల ఆరోగ్య బీమా తీసుకున్న కుటుంబాలు : **3 లక్షలు**

అత్యవసర పరిస్థితుల్లో అండగా..

వైద్య సేవలు పొందేందుకు ఆరోగ్య బీమా చేయించుకోవాలన్న అవగాహన పెరిగింది. ఇటీవల వైద్యం కోసం వస్తున్న వారిలో ఎక్కువ శాతం ఆరోగ్య బీమా కార్డు ద్వారానే సేవలు పొందుతున్నారు. దీని వల్ల అత్యవసర పరిస్థితిలో రోగుల కుటుంబాలకు డబ్బు గురించి హైరానా పడాల్సిన పరిస్థితి తప్పింది. పలు కారణాలతో ఆరోగ్య సమస్యలు పెరుగుతున్నాయి. వైద్యానికి భారీ మొత్తంలో ఖర్చు చేయాల్సి వస్తుంది. ఈ నేపథ్యంలో ఆరోగ్య బీమా కొంత ధీమా కల్పిస్తోంది.

- దామెర అనిల్‌కుమార్, ఐఎంఏ రామగుండం అధ్యక్షుడు

అన్నింటికీ ఆధారం.. ఇంకెన్నాళ్లో అంతరాయం

అబ్బాయి కాలేజీలో చేరడానికి ధ్రువపత్రం కావాలి.. అమ్మాయి ఉపకార వేతనానికి దరఖాస్తు చేయాలి.. ప్రభుత్వ పథకానికి అర్హత పొందాలంటే అధికారి నివాసాన్ని ధ్రువీకరించాలి.. వైకల్యంతో బాధ పడుతూ.. సదరం శిబిరానికి హాజరు కావాలన్నా ముందుగా స్లాట్ నమోదు చేసుకోవాల్సిందే.. ఇలా నిత్య జీవితంలో వివిధ అవసరాలకు 'మీసేవ' కేంద్రాలను ఆశ్రయించాల్సి వస్తోంది.. కొద్ది రోజులుగా సేవలు నిలిచిజనం ఇబ్బందులు పడుతున్నారు..

సాంకేతిక సమస్యలతో నిలిచిన మీసేవలు

న్యూస్‌టుడే, పెద్దపల్లి కలెక్టరేట్, ఓదెల

దాదాపు రెండు నెలలుగా మీసేవ సర్వర్ మొరాయించడం దరఖాస్తుదారులను ఆందోళనకు గురి చేస్తోంది. అత్యవసరం కావడంతో ప్రతి రోజూ కేంద్రాల చుట్టూ తిరగాల్సి వస్తోంది. కులం, ఆదాయం, నివాసం, జనన, మరణ ధ్రువీకరణ పత్రాలు, ఇతర సేవలు అందుబాటులో లేకుండా పోయాయి. మూడు రోజుల కిందట కొన్ని సాంకేతిక సమస్యలు సవరించినా పూర్తి స్థాయి సేవలు అందుబాటులోకి రాలేదు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు వివరాలు కనిపించకపోవడంతో రీఅప్‌లోడ్ చేయాల్సి వస్తోంది.

300 అంశాలకు కీలకం

వివిధ ప్రభుత్వ శాఖల్లో ఏ పని కావాలన్నా ముందుగా మీసేవ కేంద్రాల ద్వారానే దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. రెవెన్యూ, రిజిస్ట్రేషన్లు, పంచాయతీరాజ్, మున్సిపల్, పోలీస్, విద్య, వైద్యం, సంక్షేమం, కార్మిక శాఖలకు సంబంధించి అమలు చేస్తున్న పథకాలు, ఆధార్, ఆరోగ్యశ్రీ అప్‌డేట్ వంటి దాదాపు 300 సేవలకు మీసేవ కేంద్రాలే కీలకం. ఇందులో సుమారు 50కి పైగా ప్రధానమైనవి. ముందుగా మీసేవ కేంద్రాల్లో దరఖాస్తు చేసి, సంబంధిత కార్యాలయాల్లో పత్రాలు సమర్పించాల్సి ఉంటుంది.

పెండింగ్‌లో 1,703 దరఖాస్తులు

జిల్లాలో 148 మీసేవ కేంద్రాలున్నాయి. సేవలు నిలిచిపోయిన కాలంలో ఆన్‌లైన్‌లో నమోదు చేసిన కులం, ఆదాయం, నివాసం, ఈబీసీ, ఓబీసీ, కార్మిక శాఖ ఆరోగ్య బీమా దరఖాస్తుల వివరాలు ప్రస్తుతం కనిపించడం లేదు. జిల్లావ్యాప్తంగా 1,703 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. జనన, మరణ ధ్రువపత్రాలు ఇప్పటికీ రావడం లేదు. ఆదాయ, నివాస ధ్రువపత్రాల్లో ఫొటో కనిపించడం లేదు.




పెద్దపల్లి మీసేవ కేంద్రంలో దరఖాస్తుదారులు

రెండు నెలలుగా..

- రాష్ట్రవ్యాప్తంగా జులై 12 నుంచి సెప్టెంబరు 10 వరకు మీసేవ కార్యకలాపాలకు అంతరాయం కలిగింది.
- ఈ నెల 11 నుంచి 20 వరకు సేవలు పూర్తిగా నిలిచిపోయాయి. గత నాలుగు రోజులు కొన్ని సేవలు అందుబాటులోకి వచ్చాయి.
- వృత్తివిద్యా కోర్సులు ప్రారంభమయ్యే సమయం కావడంతో సకాలంలో ధ్రువపత్రాలు అందక విద్యార్థులు ఇబ్బందులు పడ్డారు.
- సకాలంలో ఆదాయ ధ్రువపత్రాలు సమర్పించకపోవడంతో ఫీజు రాయితీ కోల్పోయే ప్రమాదం నెలకొంది.

నెల రోజులుగా తిరుగుతున్నా



సుల్తానాబాద్ పురపాలక సంఘం పరిధిలో మా మనవడి జనన ధ్రువపత్రం కోసం మీసేవలో దరఖాస్తు చేసుకున్నా. నెల రోజులుగా ప్రతి రోజూ కేంద్రం చుట్టూ తిరుగుతున్నా. ఉన్నతాధికారులు చొరవ తీసుకొని సమస్యను పరిష్కరించాలి.

-మొగిలి సంపత్, కనగర్తి, ఓదెల మండలం

త్వరలోనే పూర్తి స్థాయిలో..

రాష్ట్రవ్యాప్తంగా మీసేవ కేంద్రాల్లో సాంకేతిక సమస్య నెలకొంది. సేవలను అందుబాటులోకి తెచ్చేందుకు నిపుణులు యత్నిస్తున్నారు. ఇప్పటివరకు చాలా సేవలు అందుబాటులోకి వచ్చాయి. మిగిలినవి త్వరలోనే అందుతాయి. -శ్యామ్‌ప్రసాద్‌లాల్, అదనపు కలెక్టర్

స్వచ్ఛ పల్లెలే లక్ష్యంగా పారిశుద్ధ్య చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీహర్ష

పెద్దపల్లి కలెక్టరేట్, న్యూస్‌టుడే: స్వచ్ఛ పల్లెల లక్ష్యంగా యంత్రాంగం చర్యలు చేపట్టాలని కలెక్టర్ శ్రీహర్ష సూచించారు. సమీకృత పాలనా ప్రాంగణంలో మంగళవారం పంచాయతీ శాఖపై నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. సీజనల్ వ్యాధులకు అడ్డుకట్ట వేయడానికి ప్రత్యేక పారిశుద్ధ్యంపై దృష్టి సారించాలన్నారు. ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను క్షేత్ర స్థాయిలో పరిశీలించాలన్నారు. ఉద్యాన, వ్యవసాయ శాఖల సమీక్షలో మాట్లాడుతూ నవంబరు నాటికి 1,500 ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగయ్యేలా ప్రోత్సహించాలన్నారు. వానాకాలం ధాన్యం సేకరణపై సన్నద్ధత ముమ్మరం చేయాలన్నారు. జిల్లా సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో 'అంగన్‌వాడీల్లో పూర్వ ప్రాథమిక విద్య బలోపేతం'పై కలెక్టర్ దూరదృశ్య మాధ్యమంలో అజీమ్ ప్రేమ్‌జీ సంస్థ ప్రతినిధులతో సమీక్షించారు. కార్యక్రమాల్లో అదనపు కలెక్టర్ అరుణశ్రీ, జిల్లా పంచాయతీ అధికారి వీరబ్రహ్మయ్య, గ్రామీణాభివృద్ధి అధికారి రవీందర్ రాథోడ్, వైద్యాధికారి ప్రమోద్‌కుమార్, వ్యవసాయ అధికారి ఆదిరెడ్డి, ఉద్యానవన అధికారి జగన్మోహన్‌రెడ్డి, సంక్షేమ అధికారి రవూఫ్ ఖాన్, అధికారులు పాల్గొన్నారు.

పట్టు పెరుగుతోంది

● ఉమ్మడి జిల్లాలో మల్బరీ సాగుపై రైతుల ఆసక్తి



మల్బరీ మొక్కల పెంపకం

న్యూస్‌టుడే, జగిత్యాల వ్యవసాయం

ఉమ్మడి జిల్లాలో సాగు అనుబంధంగా పట్టుపురుగుల పెంపకం ఏటికేడు విస్తరిస్తోంది. రైతులకు ప్రత్యామ్నాయ ఆదాయ వనరుగా మల్బరీసాగు నాలుగు జిల్లాల్లో దాదాపుగా 279 ఎకరాలకు విస్తరించగా మరో 90 మంది రైతులు నూతనంగా పట్టు పురుగుల పెంపకానికి దరఖాస్తు చేయటం సాగు సానుకూలతను వెల్లడిస్తోంది.

రాయితీలు

సిల్క్ సమగ్ర పథకం ద్వారా మల్బరీ మొక్కలు, పట్టుపురుగుల పెంపకానికి పలు రాయితీలు ఇస్తున్నారు. సాధారణ రైతులకు 2 ఎకరాల్లో సాగుకు 60 వేలు ఇస్తుండగా ఎస్సీ, ఎస్టీ రైతులకు రూ. 78 వేలు ఇస్తున్నారు. పట్టుపురుగులను పెంచే షెడ్డు నిర్మాణానికి రూ.5-6.5 లక్షలు ఖర్చవుతుండగా జనరల్ రైతులకు రూ.2.25 లక్షలు, ఎస్సీ, ఎస్టీ రైతులకు రూ.2.95 లక్షలను రాయితీగా ఇస్తున్నారు. షెడ్డులో అమర్చే ఒక్కో స్టాండ్‌కు రూ.17 వేలు, నేత్రికలు, ట్రేలు, ఇతర సామగ్రికి రూ.4 వేలు, రోగ నిరోధక మందులకు రూ.2500 నుంచి రూ.3250 చొప్పున నిధులను ఇస్తున్నారు. గతంలో పట్టుగూళ్లకు కిలోకు రూ.75 చొప్పున రైతులకు ఇచ్చిన ఇన్సెంటివ్ మొత్తాన్ని కొనసాగించాల్సి ఉంది. ఉద్యానశాఖద్వారా, పొలాసలోని వ్యవసాయ కళాశాలలోనూ పట్టుపురుగుల పెంపకానికి రైతులకు శిక్షణ ఇస్తున్నారు.



దిగుబడి

మల్బరీ మొక్కలను ఒకసారి నాటితే నిరంతరం కాపు వస్తుంది. వీటిపేరిట బెడద ఉండదు. పట్టుసాగును చేపట్టిన తొలిసారే షెడ్డు, చంద్రికలు, తడకలు, నెట్లు తదితరాలకు పెట్టుబడి ఉంటుంది. తరువాతి పంటలకు కేవలం గుడ్లను కొనటం, మందు ద్రావణం, కూలీల ఖర్చు తదితర చిన్నచిన్న పెట్టుబడులు మాత్రమే ఉంటాయి. మల్బరీ ఇదివరకు సాగుచేస్తున్నవారు ఏడాదిలో సరాసరిగా 6-8 పంటలవరకు కాపు తీసుకున్నారు. 100 గుడ్లకు 80 కిలోల వరకు పట్టుగూళ్లు వస్తుండగా కిలోకు కుకూన్ ధర రూ.550-670 వరకుంది. హైదరాబాద్, జనగాంలో పట్టుగూళ్ల విక్రయ మార్కెట్లున్నాయి. 25-35 రోజులకొక పంట పూర్తవుతుండగా ఖర్చులుపోను ఎకరాకు కనీసం రూ.80 వేల నుంచి రూ.1.30 లక్షల వరకు ఆదాయం వస్తోంది. పట్టుపురుగులపై వచ్చే తెగుళ్లను సమగ్రంగా నిరోధించటం, పట్టుగూళ్ల అల్లకంలో దశల్లో ఇంటిల్లిపాది శ్రమించటంవల్ల రైతులు సత్ఫలితాలను సాధిస్తున్నట్లు ఉద్యానశాఖ అధికారి శ్యామ్‌ప్రసాద్ తెలిపారు.



పట్టుపురుగులు

ఏడాది పొడవునా ఆదాయం



పట్టుపురుగుల పెంపకంతో ఏడాది పొడవునా నిరాదాయం పొందవచ్చు. పట్టుపురుగులపై వచ్చే తెగుళ్లపట్ల అప్రమత్తంగా ఉంటే ఎకరా విస్తీర్ణంలోని పంటకు కనీసం 1.20 క్వింటాళ్లకుపైగా పట్టుగూళ్లు వస్తాయి. ప్రభుత్వం పట్టుగూళ్లకు ఇన్సెంటివ్ పెంచి ఇచ్చినట్లయితే మరింత ప్రోత్సాహకంగా ఉంటుంది.

- నేరెళ్ల చంద్రమౌళి, రైతు, కల్లెడ, జగిత్యాల మండలం

ప్రతిభకు వేదిక.. బాలల వేడుక

ఈ నెలాఖరులో కళోత్సవ్

న్యూస్‌టుడే, కరీంనగర్ విద్యావిభాగం

ఉమ్మడి జిల్లాలో విద్యార్థులు పాఠ్యేతర అంశాలపై ఆసక్తి చూపుతున్నారు. పాఠశాలల్లో జరిగే ప్రత్యేక దినోత్సవాల కార్యక్రమాల్లో వివిధ కళల్లో తమప్రతిభను చాటుకుంటున్నారు. ఇలాంటి వారిని ఒక వేదికపైకి తీసుకొచ్చి వారిలోని ప్రతిభను వెలుగులోకి తెచ్చి ప్రోత్సహించేందుకు రాష్ట్ర విద్యాశాఖ కళోత్సవ్ పేరుతో పోటీలను నిర్వహిస్తోంది. ఎస్‌సీఈఆర్‌టీ వారు రాష్ట్ర సమగ్ర శిక్ష అభియాన్‌తో కలిసి ఏటా సంప్రదాయ కళాంశాల్లో విద్యార్థుల ప్రదర్శనలకు ఇది వేదికగా నిలిచేలా మండల, జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో పోటీలను నిర్వహిస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో జిల్లా, మండల స్థాయిలో విద్యార్థులకు ఈ నెలాఖరులో పోటీలను నిర్వహించనున్నారు. మూడేళ్లుగా నిర్వహిస్తున్న ఈ పోటీల్లో విద్యార్థులు రాష్ట్రస్థాయిలో పలు ప్రదర్శనల్లో ప్రతిభ చాటిన సందర్భాలున్నాయి.

జిల్లా	పాఠశాలలు	విద్యార్థులు
కరీంనగర్	929	1,12,829
జగిత్యాల	1,069	1,23,315
పెద్దపల్లి	712	80,282
సిరిసిల్ల	602	61,579



గత కళోత్సవ్‌లో విద్యార్థి నృత్యం

ప్రోత్సహిస్తే ప్రయోజనం

కళల పట్ల విద్యార్థులు ఆసక్తి చూపడంలో ముందు వరుసలో నిలుస్తున్నారు. టీవీలు, సామాజిక మాధ్యమాల సౌజన్యంతో వారికి ఇష్టమైన అంశంలో ప్రావీణ్యం పెంచుకుంటున్నారు. తల్లిదండ్రులు పలు అంశాల్లో బాలలకు ప్రత్యేకంగా శిక్షణ ఇప్పిస్తున్నారు. పాఠశాలల్లో జరిగే పలు కార్యక్రమాల్లో విద్యార్థులు పలు అంశాల్లో రాణిస్తూ అందరినీ అలరిస్తున్నారు. ఇప్పుడు కళోత్సవ్‌లో పాల్గొనేందుకు వారికి ఆసక్తి ఉన్నా వారిని ప్రోత్సహించి వారి ప్రతిభకు మరింత మెరుగులు దిద్దే చర్యలు ఉపాధ్యాయులు చేపడితే వారు మరింత రాణించే అవకాశముంది.

ఆరు అంశాల్లో పోటీలు

గతంలో పది కళాంశాల్లో పోటీలు నిర్వహించగా, ఈ విద్యాసంవత్సరంలో ఆరు అంశాల్లో నిర్వహిస్తున్నారు. వోకల్ మ్యూజిక్, ఇన్‌స్ట్రుమెంటల్ మ్యూజిక్, నృత్యం, థియేటర్, విజువల్ ఆర్ట్స్, సంప్రదాయ కథలు చెప్పడం వంటి అంశాల్లో పోటీలు జరుగనున్నాయి. ఉమ్మడి జిల్లాలోని అన్ని యాజమాన్యాల పాఠశాలలు, కళాశాలల్లో 9వ తరగతి నుంచి ఇంటర్ చదువుతున్న విద్యార్థులు ఈ పోటీలకు అర్హులు. మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిలో ప్రతిభను చాటి జాతీయ స్థాయికి ఎంపికై విజేతలుగా నిలిచిన వారికి నగదుతోపాటు ప్రశంసాపత్రాలను అందిస్తున్నారు. పోటీల్లో ప్రతి విద్యాసంస్థ నుంచి ఒక్కో విభాగంలో ఒక బాలుడు, ఒక బాలికను అనుమతిస్తారు. పోటీలకు సంబంధించిన వివరాల కోసం ఉపాధ్యాయులు, విద్యార్థులు ఆయా జిల్లాలోని సమగ్ర శిక్షా అధికారులను సంప్రదించి పూర్తి సమాచారాన్ని పొందే వీలుంది.

విద్యార్థులు పాల్గొనేలా చర్యలు

- కె.అశోక్‌రెడ్డి, సెక్టోరల్ అధికారి, కరీంనగర్

వివిధ కళల్లో ఆసక్తి గల విద్యార్థులకు కళోత్సవ్ మంచి అవకాశం. ఉపాధ్యాయులు ఆసక్తి గల విద్యార్థులను ఇందులో ప్రోత్సహించాలి. ఈ నెలాఖరులో పోటీలు ఉంటాయి.

18 తులాల బంగారు ఆభరణాలు మాయం

కరీంనగర్ నేరవార్తలు, న్యూస్‌టుడే: ఇంట్లోని రూ. 3.50 లక్షలు అలాగే ఉన్నా.. 18 తులాల బంగారు ఆభరణాలు మాత్రం అపహరణకు గురైన ఘటన మిస్టరీగా మారింది. కరీంనగర్ రెండో ఠాణా పోలీసుల కథనం ప్రకారం.. నగరంలోని ప్రగతినగర్‌లో నివాసం ఉంటున్న పిట్టల ప్రశాంత్ గ్రానైట్ క్వారీ సంస్థ కొనసాగిస్తున్నారు. అతడు మంగళవారం క్వారీ వద్దకు వెళ్లగా ఆయన భార్య లహరీ మధ్యాహ్నం ఇంటికి తాళం వేసి బయటకు వెళ్లింది. ఇంటికి వచ్చి తాళం తీసి లోనికి వెళ్లగా మరోవైపు ఉన్న తలుపులు తెరచి ఉన్నాయి. అనుమానంతో బీరువాలో చూడగా 18 తులాల బంగారు ఆభరణాలు కనిపించలేదు. బీరువాలో మరోవైపున రూ.3.50 లక్షల నగదు భద్రంగానే ఉంది. ఈ మేరకు సమాచారం అందుకున్న నగర ఏసీపీ నరేందర్, రెండో ఠాణా సీఐ విజయ్‌కుమార్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు.



ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

జాతీయ స్థాయి ట్రెక్కింగ్ పోటీలకు బడితండా వాసి ఎంపిక

రుద్రంగి, న్యూస్‌టుడే: హిమాచల్‌ప్రదేశ్‌లో అక్టోబర్ 22న నిర్వహించే జాతీయ స్థాయి ట్రెక్కింగ్ పోటీలకు రుద్రంగి మండలం బడితండా గ్రామానికి చెందిన విద్యార్థి మాలోత్ అనిల్ ఎంపికయ్యాడు. అనిల్ ప్రస్తుతం కరీంనగర్‌లోని ఎస్ఆర్ఆర్ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో బీకాం రెండో సంవత్సరం చదువుతున్నాడు. ఇటీవల శాతవాహన విశ్వవిద్యాలయంలో నిర్వహించిన ట్రెక్కింగ్ పోటీల్లో అత్యున్నత ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. దీంతో కళాశాల అధ్యాపక బృందంతోపాటు బడితండా వాసులు అతనిని అభినందించారు.



అనిల్‌ను అభినందిస్తున్న అధ్యాపక బృందం

పేరుకే కమిటీలు.. పరిష్కారం కాని సమస్యలు

న్యూస్‌టుడే, హుజూరాబాద్

పట్టణాభివృద్ధిని దృష్టిలో పెట్టుకొని ఉమ్మడి జిల్లాలోని పురపాలికలు, నగరపాలికల్లో ఏర్పాటుచేసిన వార్డు కమిటీలు ఉత్సవ విగ్రహాలుగా మిగిలాయి. అభివృద్ధి పనుల్లో పాలకవర్గం, అధికార యంత్రాంగంతోపాటు ప్రజలను భాగస్వాములను చేసే లక్ష్యంతో 2020 ఏప్రిల్‌లో గత ప్రభుత్వం వీటిని ఏర్పాటు చేసింది. నాలుగేళ్లు దాటినా ఈ కమిటీల సలహాలు, సూచనలు తీసుకోకుండా నిర్వీర్యం చేశారు. ఫలితంగా అభివృద్ధి పనుల్లో వీరి భాగస్వామ్యం పూర్తిగా కొరవడింది.

పురపాలికల్లో వీటి భాగస్వామ్యం శూన్యం

401 వార్డులు.. 1844 కమిటీలు

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఉన్న 14 పురపాలికలతోపాటు.. కరీంనగర్, రామగుండం నగరపాలికల్లోని 401 వార్డుల్లో 1844 కమిటీలను ఏర్పాటుచేశారు. ఇందులో 27,660 మంది సభ్యులున్నారు. ఒక్కో వార్డుకు నాలుగు కమిటీల చొప్పున ఒక్కో కమిటీలో 15 మంది సభ్యులతో. . యువకులు, విశ్రాంత ఉద్యోగులు, మహిళలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో కలిపి వీటిని ఏర్పాటు చేశారు.

సమావేశాల ఊసే లేదు..

ప్రతి వార్డుకు కమిటీలను నియమించి సభ్యులకు లక్ష్యాలు నిర్దేశించారు. అయితే ఏర్పాటు సమయంలో చూపిన ఆసక్తి. . ఆ తర్వాత పూర్తిగా కొరవడింది. వార్డు కమిటీ సభ్యులతో రెండు, మూడు నెలలకో సారి ప్రత్యేక సమావేశాలు నిర్వహించి.. చేపట్టాల్సిన పనులు, సమస్యలపై చర్చించాలి. అనంతరం అందరి ఆమోదంతో ఏకగ్రీవంగా పనులను ఎంపిక చేసి వార్డు అధికారి ద్వారా పురపాలక కమిషనర్ దృష్టికి తీసుకెళ్లాలి. కమిషనర్ పాలకవర్గం దృష్టికి తీసుకెళ్లి ఆయా సమస్యలను పరిష్కరించేలా కృషి చేయాల్సి ఉంది. అయితే ఒక్కసారి కూడా కమిటీ సభ్యులతో సమావేశాలు నిర్వహించడం, అభివృద్ధి పనుల ప్రణాళికలు రూపొందించిన దాఖలాలు లేవు. ఫలితంగా సమస్యలు వెంటాడుతున్నాయి.



హుజూరాబాద్‌లోని పద్మానగర్‌లో బురద రోడ్డుతో అవస్థలు

ఉమ్మడి జిల్లాకు సంబంధించిన వివరాలు..

జిల్లా	పురపాలికలు	వార్డులు	కమిటీలు	సభ్యులు
కరీంనగర్	4	146	584	8,760
జగిత్యాల	5	134	536	8,040
పెద్దపల్లి	3	114	456	6,840
సిరిసిల్ల	2	67	268	4,020



హుజూరాబాద్‌లోని పురపాలిక సంఘ కార్యాలయం

ఈ ప్రభుత్వం అయినా పట్టించుకునేనా?

ఆయా వార్డుల్లో వనమహోత్సవం, పారిశుద్ధ్య నిర్వహణ, తాగునీటి సరఫరా, అక్రమ నిర్మాణాల గుర్తింపు తదితర అంశాలపై పాలకవర్గం, అధికార యంత్రాంగం ఈ కమిటీ సభ్యుల సలహాలు, సూచనలు తీసుకొని ఆయా పనులను చేపట్టాల్సి ఉంటుంది. కానీ నాలుగేళ్లుగా ఈ కమిటీల అభిప్రాయాన్ని పరిగణనలోకి తీసుకోకుండా నిర్వీర్యం చేశారు. కొత్త ప్రభుత్వం ఏర్పాటయ్యాకనైనా వీటికి ప్రాధాన్యత ఇస్తుందని ఆశించినా.. ఆ దిశగా చర్యలు మాత్రం చేపట్టలేదు. అసలు వార్డు కమిటీలు ఉన్నాయనే విషయం కూడా చాలా మందికి తెలియదంటే వీటి ప్రాధాన్యత ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు.

రాజన్న హుండీ ఆదాయం రూ.1.44 కోట్లు

వేములవాడ, న్యూస్‌టుడే: ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన వేములవాడలోని శ్రీరాజరాజేశ్వరస్వామి ఆలయ హుండీని అధికారులు మంగళవారం లెక్కించారు. 12 రోజులకు రూ.1,44,06,154 ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో వినోద్‌రెడ్డి తెలిపారు. బంగారం 710 గ్రాములు, వెండి 14 కిలోలను భక్తులు కానుకల రూపంలో స్వామివారికి సమర్పించినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో దేవాదాయశాఖ కరీంనగర్ అసిస్టెంట్ కమిషనర్ కార్యాలయం పరిశీలకుడు సత్యనారాయణ, ఆలయ అధికారులు, సిబ్బంది, స్వచ్ఛంద సంస్థ మహిళలు పాల్గొన్నారు.



కానుకలు లెక్కిస్తున్న ఉద్యోగులు తదితరులు

శ్రీరామసాగర్‌కు పెరిగిన వరద

జగిత్యాల ధరూర్ క్యాంపు, న్యూస్‌టుడే: గోదావరి నదీ పరీవాహక ప్రాంతంలో కురుస్తున్న వర్షాలతో శ్రీరామసాగర్ ప్రాజెక్టులోకి వరద మంగళవారం సాయంత్రం వరకు 45,858 క్యూసెక్కులకు పెరిగింది. ప్రాజెక్టు నుంచి వరదకాలువకు నీటివిడుదలను 15 వేల క్యూసెక్కులకు పెంచి మధ్యమానేరు జలాశయానికి తరలించనున్నారు. ఇన్‌ఫ్లో పెరగటంతో 7 గేట్లను తెరచి 21,868 క్యూసెక్కుల మిగులు జలాలను గోదావరిలోకి విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టులో గరిష్ఠస్థాయిలో నీటినిల్వ 80.501 టీఎంసీలుగా, నీటిమట్టం 1091 అడుగులుగా ఉంది. ప్రాజెక్టునుంచి గోదావరి నదిలోకి, వరదకాలువకు నీటిని విడుదల చేస్తున్నందున మత్స్యకారులు, పశువుల కాపరులు జాగ్రత్తగా ఉండాలని అధికారులు సూచించారు.



వరద కాలువలో నీరు

ఓ మోస్తరు నుంచి భారీ వర్షసూచన

ఉమ్మడి జిల్లాలో రాగల అయిదు రోజుల్లో అక్కడక్కడ ఓ మోస్తరు నుంచి భారీ వర్ష సూచన ఉందని జగిత్యాల పరిశోధనస్థానం సహ పరిశోధన సంచాలకులు డాక్టర్ జి.శ్రీనివాస్ తెలిపారు. ఉరుములు, మెరుపులు, బలమైన గాలులతోకూడిన వర్షసూచన ఉందన్నారు. 22-24 డిగ్రీల కనిష్ఠ, 33-34 డిగ్రీల సెల్సియస్ గరిష్ఠ ఉష్ణోగ్రతలు నెలకొంటాయని సూచించారు.

మధ్యమానేరుకు 8,200 క్యూసెక్కులు

బోయినపల్లి: రాజరాజేశ్వర జలాశయానికి వరద కొనసాగుతుంది. ఎస్సారెస్పీ నుంచి వరద కాలువ ద్వారా 6 వేలు, మానేరు, మూలవాగుల నుంచి 2200 క్యూసెక్కులు వచ్చి చేరుతుంది. జలాశయం పూర్తి సామర్థ్యం 27.5 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 24.33 టీఎంసీల నీరు నిల్వ ఉంది. వస్తున్న ఇన్‌ఫ్లో ఆధారంగా నీటి విడుదల ఉంటుందని అధికారులు తెలిపారు. జలాశయం దిగువన మానేరు వాగులో రైతులు తమ మోటార్లు తొలగించాలని సూచించారు.

నవోదయ విద్యాలయ ప్రవేశానికి గడువు పొడిగింపు

చొప్పదండి, న్యూస్‌టుడే: నవోదయ పాఠశాలలో 2025-26 సంవత్సరానికిగాను ఆరో తరగతి ప్రవేశ గడువు వచ్చే నెల 7 వరకు పొడిగించినట్లు ప్రిన్సిపల్ మంగతాయారు ఒక ప్రకటనలో తెలిపారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేశాక పొరపాట్లు సరిదిద్దుకోవడానికి అక్టోబరు 8 నుంచి 9 వరకు అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.

పీజీ ఫలితాలు విడుదల

కరీంనగర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే: శాతవాహన విశ్వవిద్యాలయం పరిధిలో జులై, ఆగస్టులో నిర్వహించిన పీజీ ఫలితాలు విడుదల చేసినట్లు ఎస్‌యూ పరీక్షల నియంత్రణాధికారి డా. శ్రీరంగప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంఏ (ఆంగ్లం, ఉర్దూ, తెలుగు, ఎకనామిక్స్, సోషియాలోజీ, ఎంఎస్‌డబ్ల్యూ), ఎమ్మెస్సీ (బాటనీ, జంతుశాస్త్రం, స్టాటిస్టిక్స్, న్యూట్రీషన్), ఎంసీఏ నాలుగు, రెండో సెమిస్టర్ పరీక్ష ఫలితాలు www.satavahana.ac.in వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నట్లు పేర్కొన్నారు.

ప్రైవేటు ఉపాధ్యాయులకు సౌకర్యాలు కల్పించండి

కరీంనగర్ విద్యావిభాగం, న్యూస్‌టుడే: ఎలాంటి ఆధారం లేని పలువురు పట్టభద్రులకు ప్రైవేటు పాఠశాలలు ఉపాధి కల్పిస్తున్నాయని తెలంగాణ ప్రభుత్వామోదిత పాఠశాలల యాజమాన్యాల సంఘం (ట్రస్మా) రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు వై.శేఖర్‌రావు తెలిపారు. కరీంనగర్‌లో మంగళవారం ఉమ్మడి జిల్లాలోని ప్రైవేటు పాఠశాలల పలువురి ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానించి మాట్లాడారు. ప్రైవేటు ఉపాధ్యాయులకు ఆరోగ్యకార్డులు, రూ.10 లక్షల ఆరోగ్య బీమా, పెన్షన్ వంటి సౌకర్యాలు కల్పించాలని.. ప్రైవేటు పాఠశాలల సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఆలిండియా ప్రిన్సిపల్స్ లీడర్స్ అసోసియేషన్ ఫౌండర్, సెక్రటరీ డాక్టర్ ఎ.జోష్ణరావు, ట్రస్మా రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్.యాదగిరి, పలు జిల్లాల అధ్యక్షులు శ్రీనివాస్‌గౌడ్, ఎం.తిరుపతిరెడ్డి, కె.కేశవరెడ్డి, శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.



ఉత్తమ ఉపాధ్యాయినిగా సర్టిఫికెట్ అందిస్తున్న ట్రస్మా నాయకులు

బ్యాంకు ఖాతాల నుంచి రూ.20 లక్షలు మాయం

● కేసును ఛేదించిన కరీంనగర్ సైబర్ క్రైం పోలీసులు

కరీంనగర్ నేరవార్తలు, న్యూస్‌టుడే: నమ్మకంగా మెదిలి బ్యాంకు ఖాతాల నుంచి రూ.20 లక్షలు కాజేసిన ఘటన ఇది. రాష్ట్ర సైబర్ సెక్యూరిటీ బ్యూరో కథనం ప్రకారం.. కరీంనగర్‌లోని నీటిపారుదల శాఖలో ఎం.డి.సమీయుద్దీన్ పర్యవేక్షణాధికారిగా పని చేసి 2013లో ఉద్యోగ విరమణ పొందారు. అతడు అవివాహితుడు. సమీయుద్దీన్ ఇద్దరు చెల్లెళ్లకూ వివాహం కాలేదు. ఉద్యోగ విరమణ చేసిన తరువాత వచ్చిన కొంతడబ్బును ఓ బ్యాంకు ఖాతాలో, మరికొంత నగదును తన సోదరి సబీహా సుల్తానా బ్యాంకు ఖాతాలో జమ చేశారు. సమీయుద్దీన్ పని చేస్తున్న నీటిపారుదల శాఖలోనే జహంగీర్ జూనియర్ అసిస్టెంట్‌గా పని చేసేవారు. ఈ క్రమంలో జహంగీర్, సమీయుద్దీన్ కుటుంబాల మధ్య పరిచయం ఏర్పడింది. సమీయుద్దీన్ 2022లో మృతి చెందారు. అతడి బ్యాంకు ఖాతా, తన సోదరి సబీహా సుల్తానా బ్యాంకు ఖాతాల వివరాలు జహంగీర్ తెలుసుకున్నాడు. మూడు నెలల కింద కరీంనగర్‌లో జిమ్ నిర్వాహకుడైన మహ్మద్ ఆసిఫ్ పాషాకు విషయం తెలిపి అతడితో చేతులు కలిపాడు. సమీయుద్దీన్ వినియోగించిన చరవాణి నంబర్‌ను ఆసిఫ్ పాషా రద్దు చేయించి తన పేరు మీదకు మార్చుకున్నాడు. సాంకేతిక పరిజ్ఞానంతో సమీయుద్దీన్, సబీహా సుల్తానా బ్యాంకు ఖాతాల్లో ఎంత నగదు ఉందో తెలుసుకున్నారు. సబీహా సుల్తానా బ్యాంక్ ఖాతాలో నిల్వ ఉన్న రూ.20,18,557 నగదు ఉన్నట్లు గుర్తించారు. అవసరాల మేరకు యూపీఐ ద్వారా విడుతల వారీగా రూ.20 లక్షల మేర మళ్లించుకున్నారు. నెల కింద సబీహా సుల్తానా బ్యాంకు వెళ్లి రూ.లక్ష డ్రా చేసుకున్నారు. మిగతా నిల్వ ఉన్న నగదుపై విచారించగా ఖాతాలో కేవలం రూ.4 లక్షలు ఉన్నట్లు తెలిసింది. దీంతో ఆమె కరీంనగర్ సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేయగా ఏసీపీ నరసింహారెడ్డి కేసు దర్యాప్తు చేపట్టారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి కేసును ఛేదించారు. నేరంలో కీలకపాత్ర పోషించిన ఆసిఫ్ పాషాను అరెస్టు చేసి అతడి వద్ద నుంచి రూ.18 లక్షల నగదును రికవరీ చేశారు. జహంగీర్ పరారీలో ఉన్నట్లు ఏసీపీ తెలిపారు.

రామగుండం ఠాణాలకు రాష్ట్ర స్థాయి గుర్తింపు

గోదావరిఖని, న్యూస్‌టుడే: రాష్ట్రవ్యాప్తంగా ఠాణాల్లో సేవలు, ఫిర్యాదుదారులతో వ్యవహరించే తీరుపై రామగుండం పోలీసు కమిషనరేట్ పరిధిలోని మూడు ఠాణాలకు గుర్తింపు దక్కింది. ఖని వన్‌టౌన్ స్టేషన్‌లో రిసెప్షన్ కేంద్రంలో పనిచేసే కానిస్టేబుల్ వెంకటలక్ష్మి బాధితులతో మర్యాదగా వ్యవహరించి.. సమస్య తెలుసుకొని ఠాణా అధికారి దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగే విధంగా భరోసా కల్పించడంలో ప్రత్యేకత చాటుకున్నారు. దీనికి ఫిర్యాదుల నిర్వహణలో రాష్ట్ర వ్యాప్తంగా అయిదు ఉత్తమంగా ఉన్నవి ఎంపిక చేయగా.. గోదావరిఖని ఒకటో పట్టణ పోలీసుస్టేషన్ నాలుగో స్థానంలో నిలిచింది. సమస్యలతో వచ్చే బాధితులకు వెంటనే స్పందించి సేవలందించే విధంగా బాధ్యతలు నిర్వహించిన మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి ఒకటో పట్టణ సీఐ దేవయ్య, ధర్మారం ఠాణా ఎస్.ఐ లక్ష్మణ్‌లకు గుర్తింపు దక్కింది. దీంతో సత్వర సేవల విభాగంలో పదింటిలో బెల్లంపల్లి వన్ టౌన్, ధర్మారం పోలీసుస్టేషన్‌లు వరుసగా మూడు, అయిదు స్థానాలు పొందాయి. ఆన్‌లైన్ ఫీడ్‌బ్యాక్ ద్వారా సేకరించిన సమాచారం మేరకు రాష్ట్ర వ్యాప్తంగా ఈ స్థానాలను కేటాయించారు.



వెంకటలక్ష్మి



లక్ష్మణ్

ట్రాన్స్‌జెండర్లకు ఉపాధి హామీ

కోరిన వారికి జాబ్ కార్డు మంజూరు చేయాలని కేంద్రం ఆదేశాలు

న్యూస్‌టుడే, పెద్దపల్లి కలెక్టరేట్:

ట్రాన్స్‌జెండర్లు గౌరవప్రదంగా జీవించడానికి ప్రభుత్వాలు చర్యలు తీసుకొంటున్నాయి. వారిని ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం హైదరాబాద్‌లో ట్రాఫిక్ వాలంటీర్లుగా నియమిస్తామని ప్రకటించగా.. ప్రస్తుతం కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ ఉపాధిహామీ పని కల్పించాలని ఉత్తర్వులు జారీ చేసింది. ఎలాంటి వివక్ష లేకుండా ప్రతి ఒక ట్రాన్స్‌జెండర్‌కు జాబ్ కార్డు మంజూరు చేయాలని పేర్కొంది. దీనికి సంబంధించి మార్గదర్శకాలు విడుదల చేసింది. దీంతో పల్లెల్లో ట్రాన్స్‌జెండర్ల గుర్తింపులో అధికారులు నిమగ్నమయ్యారు. మరోవైపు ఎస్సీ, ఎస్టీ వర్గాల కూలీల్లో ఇప్పటివరకు వ్యక్తిగతంగా లబ్ధిపొందిన వారి వివరాలను సేకరించి ఆన్‌లైన్‌లో నిక్షిప్తం చేస్తున్నారు.

మార్గదర్శకాల్లో ముఖ్యాంశాలు

- ✦ ట్రాన్స్‌జెండర్లకు ఆధార్ ఆధారంగా జాబ్‌కార్డు ఇవ్వాలి.
- ✦ ఒక గ్రామంలో ఇద్దరి కంటే ఎక్కువ మంది ఉంటే గ్రూప్‌గా ఏర్పాటు చేయాలి.
- ✦ గ్రూప్ లేక వ్యక్తిగతంగా ఒకే ప్రాంతంలో పని కల్పించాలి.
- ✦ పని ప్రదేశంలో వారి పట్ల ఎలాంటి వివక్ష చూపరాదు. దీని కోసం మేట్లకు అవగాహన సదస్సులు నిర్వహించాలి.
- ✦ ట్రాన్స్‌జెండర్ల సమస్యల కోసం మండల, జిల్లా స్థాయిల్లో నోడల్ అధికారిని నియమించాలి.

178కి లబ్ధి

ఉమ్మడి జిల్లాలో ట్రాన్స్‌జెండర్లకు ఉపాధిపై భరోసా కలగనుంది. ఓటరు జాబితా ప్రకారం ఉమ్మడి జిల్లాలో 178 మంది ట్రాన్స్‌జెండర్లు ఉన్నారు. నియోజకవర్గాల వారీగా చూస్తే కోరుట్లలో 4, జగిత్యాలలో 20, ధర్మపురిలో 6, రామగుండంలో 25, మంథనిలో 19, పెద్దపల్లిలో 9, కరీంనగర్‌లో 44, చొప్పదండిలో 7, వేములవాడలో 30, సిరిసిల్లలో 7, మానకొండూర్‌లో 1, హుజూరాబాద్‌లో 6 మంది ఉన్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. వీరే కాకుండా చాలా మంది ఓటు హక్కు పొందని వారు కూడా ఉన్నారు. వీరిలో 18 ఏళ్లు నిండిన వారికి జాబ్‌కార్డు మంజూరు చేయనున్నారు.

గ్రామాల వారీగా గుర్తింపు: రవీందర్ రాథోడ్, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి, పెద్దపల్లి

జిల్లాలోని గ్రామాల్లో ట్రాన్స్‌జెండర్లను గుర్తిస్తున్నారు. ప్రతి ఒక్కరికి జాబ్ కార్డు మంజూరు చేస్తాం. ప్రత్యేకంగా పని కల్పించి.. వసతులు సమకూర్చనున్నాం. వారిపై వివక్ష చూపకుండా మామూలు కూలీలకు అవగాహన కల్పిస్తాం.

మేమున్నాం.. మీకు తోడుగా.. (10 AM TO 4 PM)

గోదావరిఖని : 80085 73573
పెద్దపల్లి : 80085 73542
మంథని : 99122 68471

న్యూస్‌టుడే – ముత్తారం

? ముత్తారం మండలం దరియాపూర్ ఆదర్శ పాఠశాలకు ఆర్టీసీ బస్సులు సకాలంలో రాకపోవడంతో ఇబ్బంది పడుతున్నాం. **-యు.అక్షయ, విద్యాశ్రీ, రామయ్యపల్లి**

✔ సమస్య మా దృష్టికి వచ్చింది. ప్రభుత్వం కొత్తగా బస్సులను ఏర్పాటు చేయనుంది. అవి రాగానే [illegible] చేసి సమస్యను పరిష్కరిస్తాం. **-శ్రావణ్‌కుమార్, ఆర్టీసీ మంథని డిపో మేనేజర్**

న్యూస్‌టుడే – ధర్మారం

? ధర్మారంలో ఏడాది కిందట నిర్మించిన మండల పరిషత్తు దుకాణ సముదాయం ఖాళీగా ఉంటోంది. అద్దెకు ఇస్తే ప్రభుత్వానికి ఆదాయంతో పాటు చిరు వ్యాపారులకు ఉపాధి దొరుకుతుంది. **-శ్రీనివాస్, ధర్మారం**

✔ దుకాణాలను అద్దెకు ఇవ్వడానికి వేలం నిర్వహించాల్సి ఉంటుంది. అప్‌సెట్(కనిష్ఠ మొత్తం) అద్దె ఖరారు చేయాలని జిల్లా అధికారులకు నివేదించాం. అనుమతి రాగానే వేలం నిర్వహించి, వ్యాపారులకు అద్దెకు ఇస్తాం. **-రమేశ్, ఎంపీవో**

న్యూస్‌టుడే, పాలకుర్తి

? పాలకుర్తి మండలం బసంత్‌నగర్ జడ్పీ ఉన్నత పాఠశాల నుంచి ఈసాల తక్కళ్లపల్లి గ్రామ శివారులో గల సమ్మక్క, సారలమ్మ గద్దెల వరకు చేపట్టిన డబుల్ సీసీ రోడ్డు పనులు మధ్యలో ఆగిపోయాయి. **- స్థానికులు**

✔ ఇసుక ఆన్‌లైన్ బుకింగ్ వల్ల ఆలస్యమవుతోంది. త్వరలో పనులు పూర్తి చేస్తాం. **- శ్రీనివాస్ ఏఈ, పీఆర్, పాలకుర్తి**

మున్సిపల్ ఇన్‌ఛార్జి కమిషనర్ నియామకం


మనోహర్

మంథని, న్యూస్‌టుడే: మంథని పురపాలక సంఘం ఇన్‌ఛార్జి కమిషనర్‌గా మనోహర్‌ను నియమిస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. కమిషనర్ మల్లికార్జున స్వామిని కలెక్టర్ హైదరాబాద్ సీడీఎంఏ కార్యాలయానికి సరెండర్ చేయడంతో సూపరింటెండెంట్ మనోహర్‌ను ఇన్‌ఛార్జి కమిషనర్‌గా నియమించారు. మంగళవారం ఆయన బాధ్యతలు చేపట్టారు.

నేర వార్తలు

ద్విచక్రవాహనం ఢీకొని మహిళ దుర్మరణం


స్వరూప

పెద్దపల్లి, న్యూస్‌టుడే: రోడ్డు దాటుతున్న మహిళను ద్విచక్రవాహనం ఢీకొట్టడంతో దుర్మరణం చెందిన ఘటన పెద్దపల్లిలో మంగళవారం చోటుచేసుకుంది. ఎస్సై లక్ష్మణ్‌రావు కథనం ప్రకారం పట్టణంలోని శాంతినగర్‌లో నివాసముండే గరిగే స్వరూప(49) స్థానికంగా ఓ హోటల్‌లో పని చేస్తున్నారు. ఉదయం శాంతినగర్‌లో రాజీవ్ రహదారి దాటుతుండగా గోదావరిఖని వైపు వెళ్తున్న ద్విచక్రవాహనం వేగంగా ఢీకొట్టడంతో కింద పడిపోయారు. తల పగలడంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు. ద్విచక్రవాహనదారుడిని సుల్తానాబాద్ పురపాలిక పూసాలకు చెందిన కల్వల వసంత్‌కుమార్‌గా గుర్తించి అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. మృతురాలికి ఇద్దరు కూతుళ్లు, కుమారుడున్నారు. కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

కారు ఢీకొని ట్రాఫిక్ కానిస్టేబుల్‌కు గాయాలు

గోదావరిఖని, న్యూస్‌టుడే: విధులు నిర్వహిస్తున్న ట్రాఫిక్ కానిస్టేబుల్‌ను వేగంగా వచ్చిన కారు ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. గోదావరిఖని బస్టాండ్ సమీపంలో రాజీవ్ రహదారిపై ఉన్న స్టాపర్‌లను ట్రాఫిక్ కానిస్టేబుల్ సోము మంగళవారం సరిచేస్తున్న సమయంలో మంచిర్యాల వైపు వెళ్తున్న కారు వేగంగా వచ్చి ఢీకొంది. దీంతో సోము తీవ్రంగా గాయపడగా.. వెంటనే తోటి సిబ్బంది ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. అనంతరం కరీంనగర్ తరలించారు. కారును స్వాధీనం చేసుకున్నారు.

మహిళను దూషించిన వ్యక్తి బైండోవర్

ముత్తారం, న్యూస్‌టుడే: ముత్తారం మండలం మైదంబండకు చెందిన కండె రమేశ్‌పై మహిళను దూషించిన ఘటనలో కేసు నమోదు చేసినట్లు ఎస్సై నరేశ్ తెలిపారు. ఈ నెల 22న గ్రామానికి చెందిన మహిళ ఇంటి ఆవరణలో ఉండగా, అటుగా వెళ్తున్న రమేశ్ దుర్భాషలాడాడన్నారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు రమేశ్‌పై కేసు నమోదు చేసి తహసీల్దార్ సుమన్ ఎదుట బైండోవర్ చేసినట్లు ఎస్సై తెలిపారు.

100 కిలోల గంజాయి పట్టివేత

భద్రాచలం పట్టణం: భద్రాచలం పట్టణ శివారులో వాహన తనిఖీల్లో 100 కిలోల గంజాయిని ఆబ్కారీ ఎన్‌ఫోర్స్‌మెంట్, పోలీసులు సోమవారం పట్టుకున్నారు. ఆబ్కారీ అధికారులు జనార్దన్‌రెడ్డి, గణేశ్, జానయ్య, తిరుపతి, కరంచంద్ విలేకరుల సమావేశంలో మంగళవారం వివరాలు వెల్లడించారు. ఆంధ్రా ఒడిశా సరిహద్దుల నుంచి హైదరాబాద్‌కు తరలిస్తుండగా ఈ గంజాయి పట్టుబడినట్లు తెలిపారు. పెద్దపల్లి జిల్లా పాలకుర్తి మండలం కొత్తపల్లికి చెందిన తల్లీకొడుకు నేరెళ్ల అపర్ణ, నేరెళ్ల అఖిల్ కారులో హైదరాబాద్ తరలిస్తున్న 100 కిలోల గంజాయిని భద్రాచలం వద్ద సోమవారం స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసుతో సంబంధం ఉన్న పాత నేరస్థుడు నిజామాబాద్‌కు చెందిన మున్వర్ అలీని అదుపులోకి తీసుకున్నారు.

తెబొగకాసం పిట్ కార్యవర్గ సభ్యుల పరిచయం

యైటింక్లయిన్‌కాలనీ, న్యూస్‌టుడే: తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం ఆర్జీ-2 ఏరియా వర్క్‌షాప్ నూతన పిట్ కార్యవర్గ సభ్యులను యూనియన్ ఉపాధ్యక్షుడు శ్రీనివాస్ డీజీఎం(వర్క్‌షాప్) ఎల్లన్నకు మంగళవారం పరిచయం చేశారు. నూతన పిట్ కార్యదర్శిగా జి.శంకర్, సహాయ కార్యదర్శిగా సురేందర్, ఆర్గనైజర్‌గా రాజు, కార్యదర్శులుగా అజయ్‌కుమార్, శ్రీనివాస్, రమ్య, నారాయణరెడ్డి, కోశాధికారిగా సత్తయ్యలు నియమితులైనట్లు పేర్కొన్నారు.

అక్టోబరు 9న లాభాల వాటా చెల్లింపు

గోదావరిఖని, న్యూస్‌టుడే: కార్మికులకు లాభాల వాటాను అక్టోబరు 9న చెల్లించనున్నారు. దసరా అడ్వాన్స్ రూ.25 వేలు కూడా సెప్టెంబరు వేతనాలతో పాటు పంపిణీ చేసేందుకు యాజమాన్యం నిర్ణయించింది. ఈ మేరకు సీఎండీ బలరాం అధికారులకు దృశ్య మాధ్యమ సమావేశంలో సూచించారు. సింగరేణి వ్యాప్తంగా 42 వేల మంది కార్మికులు, అధికారులకు వాటాను పంపిణీ చేయనున్నట్లు యాజమాన్యం తెలిపింది.

ఉనికి చాటుకోవడానికే ఆరోపణలు

కమాన్‌పూర్(సెంటినరీకాలనీ), న్యూస్‌టుడే: లాభాల వాటాపై కొన్ని సంఘాలు ఉనికిని చాటుకోవడానికి ఏఐటీయూసీపై అసత్య ఆరోపణలు చేస్తున్నాయని సంఘం డిప్యూటీ జనరల్ సెక్రెటరీ వైవీరావు, సెంట్రల్ సెక్రెటరీ జూపాక రామచందర్ అన్నారు. ఏఐటీయూసీ మంగళవారం నిర్వహించిన ద్వార సమావేశంలో వారితో పాటు బ్రాంచి సెక్రెటరీ ఎమ్మార్సీరెడ్డి, వైస్ ప్రెసిడెంట్ సమ్మయ్య, నాయకులు కుమారస్వామి, రమేశ్ పాల్గొన్నారు.

తిలక్‌నగర్‌లో రహదారి విస్తరణ

గోదావరిఖని, న్యూస్‌టుడే: పట్టణంలోని తిలక్‌నగర్‌లో సర్కిల్ చుట్టూ రహదారిని వెడల్పు చేసేందుకు యాజమాన్యం పక్కన ఉన్న క్వార్టర్లను కూల్చివేసింది. ముందుగానే ఇరువైపులా ఉన్న క్వార్టర్లను ఖాళీ చేయించిన యాజమాన్యం వారికి మరో చోట నివాస గృహాలు కేటాయించారు. ఖాళీగా ఉన్న క్వార్టర్లను మంగళవారం సాయంత్రం కూల్చివేశారు.


ఖనిలో దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు


సెంటినరీకాలనీలో దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

వాటా ప్రకటన తీరుపై నిరసన

గోదావరిఖని, న్యూస్‌టుడే: వాస్తవ లాభాలపై కార్మికులకు వాటా పంపిణీ చేయకుండా నికర లాభాలపై శాతాన్ని ప్రకటించడాన్ని తీవ్రంగా ఖండిస్తూ తెబొగకాసం నాయకులు సోమవారం స్థానిక చౌరస్తా వద్ద ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. వెంటనే వాస్తవ లాభాలపై వాటా పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. ఆర్జీ-1 ఉపాధ్యక్షుడు శంకర్, సంఘం అధ్యక్షుడు ఎం.రాజిరెడ్డి, నాయకులు రామ్మూర్తి, కొమురయ్య, రవి, సతీష్, శ్రీనివాసరావు, రాజేశం, శ్రీనివాస్, జోసెఫ్, శేషగిరి, సాయి పాల్గొన్నారు.

విఫలం చేసిన పోలీసులు

యైటింక్లయిన్‌కాలనీ: కాలనీలోని తెబొగకాసం కార్యాలయం వద్ద ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేయడానికి ఆ యూనియన్ నాయకులు సిద్ధమవ్వగా గోదావరిఖని రెండో పట్టణ పోలీసులు వచ్చి దిష్టిబొమ్మను తీసుకెళ్లారు. దీంతో నిరసన తెలిపే స్వేచ్ఛను సైతం ప్రభుత్వం హరించేస్తోందంటూ నాయకులు నినాదాలు చేశారు. ప్రభాకర్‌రెడ్డి, చంద్రయ్య, అనిల్‌రెడ్డి, సురేందర్, శ్రీనివాస్, తిరుపతి పాల్గొన్నారు.

కమాన్‌పూర్(సెంటినరీకాలనీ): ప్రాతినిధ్య, గుర్తింపు సంఘాల మోసపూరిత లాభాల ప్రకటనను నిరసిస్తూ తెబొగకాసం ఆర్జీ-3 ఉపాధ్య



క్షుడు నాగెల్లి సాంబయ్య ఆధ్వర్యంలో మంగళవారం సెంటినరీకాలనీలో కాంగ్రెస్ ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. వాస్తవ లాభాల వాటాను ప్రకటించకుండా ఐఎన్‌టీయూసీ, ఏఐటీయూసీలు ప్రభుత్వానికి వత్తాసు పలుకుతున్నాయని ఆరోపించారు. సంఘం నాయకులు కుమార్‌యాదవ్, శ్రీనివాస్ పింగిలి సంపత్, కేశవరావు, రమేశ్, శ్రీనివాస్‌రెడ్డి, శ్రీకాంతరావు పాల్గొన్నారు.

కారుణ్య నియామక పత్రాల పంపిణీ

యైటింక్లయిన్‌కాలనీ, న్యూస్‌టుడే: ఆర్జీ-2 ఏరియాలో కారుణ్య నియామకాల ద్వారా ఉద్యోగాలు సాధించిన ఏడుగురికి మంగళవారం ఇన్‌ఛార్జి జీఎం నెహ్రూ పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తండ్రి వారసత్వంగా వచ్చిన ఉద్యోగంతో ఉన్నత స్థానానికి వెళ్లాలని ఆకాంక్షించారు. ఏఐటీయూసీ నాయకులు పాల్గొన్నారు.

టీటీసీలో పదోన్నతి పరీక్షలు

గోదావరిఖని, న్యూస్‌టుడే: ఈపీ ఫిట్టర్ పదోన్నతి కోసం స్థానిక సాంకేతిక శిక్షణ కేంద్రంలో మంగళవారం పరీక్షలు నిర్వహించారు. సీనియారిటీ, అనుభవం ఆధారంగా ప్రయోగ పరీక్షలు నిర్వహించిన అధికారులు అర్హత సాధించిన వారికి పదోన్నతి కల్పించనున్నారు. అధికారులు రాంమోహన్, వెంకటేశ్వర్‌రావు, రవీందర్‌రెడ్డి, హన్మంతరావు, టీటీసీ అధికారి అశోక్‌రావులు పాల్గొన్నారు.

ఇంజినీరింగ్ సంచాలకుడి పదవీ కాలం పెంపు

గోదావరిఖని, న్యూస్‌టుడే: ఇంజినీరింగ్ సంచాలకుడు సత్యనారాయణరావు పదవీ కాలాన్ని మరి కొంత కాలం పొడగించారు. ఆయన వచ్చే ఏడాది ఉద్యోగ విరమణ పొందనుండటంతో 11 నెలల ఆరు రోజుల పదవీ కాలాన్ని పెంచుతూ ఛైర్మన్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.


పెద్దపల్లి ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు

కళాశాలల్లో ఎన్ఎస్ఎస్ ఆవిర్భావ వేడుకలు

జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల్లో మంగళవారం ఎన్ఎస్ఎస్(జాతీయ సేవా పథకం) ఆవిర్భావ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాలల్లో శ్రమదానం చేశారు. పిచ్చిమొక్కలను తొలగించారు. **- న్యూస్‌టుడే, బృందం**


ఖని పీజీ కళాశాల ఆవరణలో పిచ్చి మొక్కలను తొలగిస్తున్న విద్యార్థినులు

సంక్షేమ పథకాలను అర్హులకు అందించాలి

గోదావరిఖని, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులకు అందే విధంగా కాంగ్రెస్ నాయకులు కృషి చేయాలని ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ సూచించారు. గోదావరిఖని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పార్టీ ముఖ్య నాయకులతో మంగళవారం ఆయన సమావేశం నిర్వహించారు. రామగుండం ప్రాంతంలోని అన్ని డివిజన్‌లలో ప్రజా సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి కృషి చేయాలని, ఎక్కడ సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకురావాలన్నారు. వెంటనే వాటిని పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. అనంతరం నాయకులతో కలిసి పట్టణంలోని ప్రధాన వ్యాపార కేంద్రం లక్ష్మీనగర్‌లో తిరుగుతూ వ్యాపారులు, గుమాస్తాలతో మాట్లాడారు. కార్పొరేటర్లు ఉన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన మార్కెట్ కమిటీ పాలకవర్గం

ఎలిగేడు(సుల్తానాబాద్), న్యూస్‌టుడే: పెద్దపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గ సభ్యులు మంగళవారం ఎలిగేడు మండలం శివపల్లిలో ఎమ్మెల్యే విజయరమణారావును కలిశారు. ఈ సందర్భంగా ఆయన వారికి నియామక పత్రాలు అందించి, శాలువాతో సన్మానించారు. ఛైర్‌పర్సన్ ఈర్ల స్వరూప, వైస్ ఛైర్మన్ కూర మల్లారెడ్డి, సభ్యులు పాల్గొన్నారు.

డివిజన్‌కో కుట్టు శిక్షణ కేంద్రం

గోదావరిఖని, న్యూస్‌టుడే: మహిళలు స్వయం ఉపాధితో ఆర్థికంగా అభివృద్ధి సాధించాలని కాంగ్రెస్ నాయకురాలు మనాలి ఠాకూర్ అన్నారు. గోదావరిఖని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన మహిళా సాధికారత కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ప్రతి డివిజన్‌లో కుట్టు శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నామన్నారు. మహిళలు వినియోగించుకోవాలని చెప్పారు. ఇబ్బందులు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు.

ఓటరు జాబితా సవరణ ప్రక్రియపై పరిశీలన

కమాన్‌పూర్, పెద్దపల్లి కలెక్టరేట్, న్యూస్‌టుడే: కమాన్‌పూర్ ఎంపీడీవో కార్యాలయాన్ని కలెక్టర్ కోయ శ్రీహర్ష మంగళవారం సందర్శించారు. పంచాయతీ కార్యాలయంలో ఓటరు జాబితా సవరణ ప్రక్రియపై డీఎల్‌పీవో సతీశ్‌ను అడిగి తెలుసుకున్నారు. పారిశుద్ధ్య లోపం లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎంపీడీవో లలిత, ఎంపీవో భాస్కర్ ఉన్నారు. అలాగే రాఘవాపూర్ పంచాయతీలో, పెద్దపల్లి ఎంపీడీవో కార్యాలయంలోనూ కలెక్టర్ పరిశీలించారు.

29 వరకు బధిరుల వారోత్సవాలు

పెద్దపల్లి కలెక్టరేట్, న్యూస్‌టుడే: అంతర్జాతీయ బధిరుల దినోత్సవం సందర్భంగా మంగళవారం సమీకృత పాలనా ప్రాంగణంలో వైద్య ఆరోగ్య శాఖ సిబ్బందికి అవగాహన సమావేశం నిర్వహించారు. జిల్లా వైద్యాధికారి ప్రమోద్‌కుమార్


మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో ప్రమోద్‌కుమార్

మాట్లాడుతూ ఈ నెల 23 నుంచి 29 వరకు బధిరుల వారోత్సవాలు జరుపుకొంటున్నామన్నారు. ప్రపంచంలో 9.9 శాతంతో వినికి లోపంతో బాధపడుతున్నారని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో అవగాహన కల్పించాలన్నారు.

పోలీసుల నిర్బంధ తనిఖీలు

గోదావరిఖని: పట్టణంలోని విఠల్‌నగర్‌లో ఇళ్లలో ఒకటో పట్టణ పోలీసులు మంగళవారం నిర్బంధ తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ ఇంద్రసేనారెడ్డి మాట్లాడుతూ.. గంజాయి ఈ ప్రాంతం నుంచి సరఫరా అవుతున్నట్లు సమాచారం ఉందని.. అరికట్టే బాధ్యత ప్రజలే తీసుకోవాలన్నారు. ఎలాంటి సమాచారం లేకుండా ఇళ్లు అద్దెకు ఇవ్వకూడదని సూచించారు. ప్రతి వీధిలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని చెప్పారు. తనిఖీల్లో అక్రమంగా నిల్వ ఉన్న 10 లీటర్ల గుడుంబా, 18 లీటర్ల మద్యం, 13 నెంబరు ప్లేట్ లేని ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నారు.

కరాటే పోటీల్లో ప్రతిభ

మంథని, న్యూస్‌టుడే: గోదావరిఖనిలో మంగళవారం నిర్వహించిన జిల్లా స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్(ఎస్‌జీఎఫ్) కరాటే పోటీల్లో మంథని జేకేఏ షోటోఖాన్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. అండర్-14 విభాగంలో సాయిరక్షిత్, లక్ష్మణ్, శ్రీనిత, అండర్-17లో హాసిని, ఆదిత్యతేజ, శ్రావణ్‌కుమార్, దేవాన్ష్, నివాస్ చరణ్ ఉమ్మడి జిల్లాకు ఎంపికయ్యారని శిక్షకుడు



పోటీల్లో ప్రతిభ కనబర్చిన మంథని విద్యార్థులు

నాగరాజు తెలిపారు. వారిని ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి కోమురోజు శ్రీనివాస్, కరాటే జెకే సౌత్ జోన్ ఇన్‌ఛార్జి సుదర్శన్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు బానయ్య, పీఈటీలు అభినందించారు.

బొడ్డెమ్మ వేడుకలు

సుల్తానాబాద్, న్యూస్‌టుడే: సుల్తానాబాద్‌లో మంగళవారం మహిళలు బొడ్డెమ్మ వేడుకలు నిర్వహించారు. స్థానిక శివాలయంలో పుట్ట మట్టిని తెచ్చి బొడ్డెమ్మను తయారు చేశారు. పసుపు, కుంకుమ, పూలతో అలంకరించి ప్రత్యేక పూజలు చేసి ఆడిపాడారు. ఆలయ కమిటీ ఛైర్మన్ అల్లెంకి సత్యనారాయణ, సభ్యులు పాల్గొన్నారు.


సుల్తానాబాద్‌లో బొడ్డెమ్మ ఆడుతున్న మహిళలు

‘పరిహారం చెల్లింపులో అర్హులకు అన్యాయం’

మంథని, న్యూస్‌టుడే: గ్రీన్‌ఫీల్డ్ జాతీయ రహదారికి సంబంధించి పరిహారం చెల్లింపులో అర్హులైన నిర్వాసితులకు అన్యాయం జరిగిందని పుట్టపాక మాజీ ఉపసర్పంచి తిరుపతిరెడ్డి ఆరోపించారు. మంగళవారం ఆయన మంథనిలో విలేకరులతో మాట్లాడుతూ మంచిర్యాల నుంచి వరంగల్ వరకు నిర్మిస్తున్న రహదారి భూసేకరణలో పుట్టపాక, మహబూబ్‌పల్లి రైతులకు ప్రభుత్వం ఇనాం కింద భూములు ఇచ్చినప్పటికీ గెజిట్‌లో పేర్లు నమోదు చేయకుండా ఇతరుల పేర్లు నమోదు చేసి పరిహారం చెల్లించారని ఆరోపించారు. పలుమార్లు ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోలేదన్నారు. సమగ్ర విచారణ జరిపి అర్హులకు న్యాయం చేయాలని కోరారు. బాధితులు వినోద్‌కుమార్, మల్లయ్య, ఓదేలు, గట్టయ్య, రమేశ్, లక్ష్మణ్, మల్లేశ్, పోశం, స్వామి, సదానందం, చంద్రయ్య, సదయ్య పాల్గొన్నారు.


క్రీడలను ప్రారంభిస్తున్న డీవైఎస్‌వో సురేశ్

ఎస్జీఎఫ్ జోనల్ స్థాయి క్రీడలు

సుల్తానాబాద్, న్యూస్‌టుడే: సుల్తానాబాద్ మండలం రేగడిమద్దికుంటలో మంగళవారం జోనల్ స్థాయి కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ పోటీలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన జిల్లా యువజన, క్రీడల శాఖ అధికారి సురేశ్ మాట్లాడుతూ క్రీడలతో శారీరక దృఢత్వంతో పాటు మానసిక ఉల్లాసం కలుగుతుందన్నారు. సుల్తానాబాద్, ఓదెల మండలాల ఎంఈవోలు సురేందర్, రాజయ్య, ఎంపీడీవో దివ్యదర్శన్‌రావు, ఎస్జీఎఫ్ జిల్లా ప్రధానకార్యదర్శి శ్రీనివాస్, క్రీడాకారులు పాల్గొన్నారు.

జూలపల్లి: ఎస్జీఎఫ్ జోనల్ స్థాయి క్రీడల్లో జూలపల్లికి చెందిన ముగ్గురు విద్యార్థులు ప్రతిభ కబరిచారు. న్యూ బ్రిలియంట్ హైస్కూల్ విద్యార్థి సాయితేజ కబడ్డీలో, ప్రభుత్వ బాలుర పాఠశాల విద్యార్థులు వరాల అవినాష్, బొంగాని శివకృష్ణ వాలీబాల్‌లో జిల్లా స్థాయికి ఎంపికయ్యారు.

వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన

కమాన్‌పూర్, న్యూస్‌టుడే: జిల్లా మహిళా సాధికారిత కేంద్రం ఆధ్వర్యంలో మంగళవారం కమాన్‌పూర్ జడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థినులకు రుతుక్రమం, వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. జిల్లా మహిళా సాధికారిత కేంద్రం కో ఆర్డినేటర్ దయా అరుణ, జెండర్ స్పెషలిస్ట్ చెంద్రు స్వప్న, ప్రధానోపాధ్యాయుడు విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

సంక్షిప్తం

చరవాణికి దూరంగా ఉండాలి

మార్కండేయకాలనీ: ప్రతి విద్యార్థిని చరవాణికి దూరంగా ఉండాలని చైల్డ్ హెల్ప్‌లైన్ జిల్లా సమన్వయ కర్త ఉమాదేవి సూచించారు. గోదావరిఖని రమేశ్‌నగర్‌లోని బీసీ బాలికల గురుకుల పాఠశాలలో మంగళవారం ఆమె విద్యార్థినులతో మాట్లాడారు. బాల కార్మిక వ్యవస్థ, వివాహాలు, తప్పిపోయిన పిల్లల సమాచారం, పోక్సో చట్టం, అనాథ పిల్లలు తదితర విషయాలపై 1098కు సమాచారం అందజేయాలని కోరారు. ప్రిన్సిపల్ పద్మ పాల్గొన్నారు.

బాలిక విద్యకు ఊతమిచ్చిన మహనీయులు పులే

జ్యోతినగర్(మార్కండేయకాలనీ): దేశంలో బాలికల విద్య ఊతమిచ్చిన మహనీయులు మహాత్మా జ్యోతిరావు పూలే అని ఎన్టీపీసీ సీపీఐ(ఎంఎల్) న్యూడెమొక్రసీ జిల్లా కార్యదర్శి కె.రాజన్న కొనియాడారు. ఎన్టీపీసీ ఆటోనగర్‌లోని కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సీపీఎం నాయకులు శంకర్, కృష్ణ, నరేష్, జ్యోతి, బుచ్చన్న, కొమురయ్య, రాజేశం పాల్గొన్నారు.

ప్రణాళికాబద్ధంగా గ్రామాల అభివృద్ధి

పెద్దపల్లి కలెక్టరేట్: జిల్లాలో ప్రణాళికాబద్ధంగా గ్రామాలను అభివృద్ధి చేయాలని జిల్లా పంచాయతీ అధికారి వీర బుచ్చయ్య సూచించారు. మంగళవారం ఆయన పెద్దపల్లి ఎంపీడీవో కార్యాలయంలో అధికారులతో సమీక్షించారు. పల్లెల్లో మురుగు, ముళ్లపొదలు, పిచ్చిమొక్కలను తొలగించాలన్నారు. తడి, పొడి చెత్తసేకరణపై ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. డీఎల్‌పీవోలు, ఎంపీడీవోలు, ఎంపీవోలు తదితరులు పాల్గొన్నారు.

కేజీబీవీని తనిఖీ చేసిన ఎంపీడీవో

పాలకుర్తి(అంతర్గాం): అంతర్గాం మండలం కుందనపల్లి కేజీబీవీని ఎంపీడీవో అలీం మంగళవారం తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజన తీరును పరిశీలించారు. కోడిగుడ్లు అందించడం లేదని, బియ్యంలో నాణ్యత పాటించాలని సూచించారు. ఉపాధ్యాయుల హాజరు పట్టికను పరిశీలించగా 18 మంది ఉపాధ్యాయులకు ప్రత్యేకాధికారిణితో సహా తొమ్మిది మంది సాధారణ సెలవులో ఉన్నారని గుర్తించినట్లు తెలిపారు. అనంతరం పెద్దంపేటలోని ఈత బ్లాక్ ప్లాంటేషన్ పనులను పరిశీలించారు.

పాఠశాలను పరిశీలించిన ఎంఈవో

మార్కండేయకాలనీ: గోదావరిఖని అశోక్‌నగర్‌లోని జడ్పీ ఉర్దూ ఉన్నత పాఠశాలను రామగుండం ఎంఈవో ఆరెపల్లి రాజయ్య మంగళవారం పరిశీలించారు. పాఠశాల సముదాయ ప్రధానోపాధ్యాయురాలు భవానిని యూడైస్ సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఫార్మాటివ్-2 పరీక్షల నిర్వహణ, విద్యార్థుల సన్నద్ధత గురించి ఆరా తీశారు. సీఆర్‌పీ వెంకటేష్, ఉపాధ్యాయులున్నారు.

ఎయిడ్స్ నియంత్రణపై విద్యార్థులకు అవగాహన

గోదావరిఖని పట్టణం: గోదావరిఖని ప్రభుత్వ సార్వజనిక ఆసుపత్రి ఎయిడ్స్ నియంత్రణ కేంద్రం ఆధ్వర్యంలో రమేశ్‌నగర్‌లోని వాసవ్య విద్యాలయంలో మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రతినిధి శంకర్ పాల్గొని రక్తమార్పిడి, సిరంజీలు, బ్లేడ్లు తదితర వస్తువుల ద్వారా ఎయిడ్స్ ఒకరి నుంచి ఒకరికి వ్యాపించే ప్రమాదముందన్నారు. ఒకే సారి వాడి పడేసే సిరంజీలు, బ్లేడ్లు వినియోగించాలన్నారు. తల్లికి ఎయిడ్స్ ఉన్నప్పటికీ బిడ్డకు రాకుండా చికిత్స అందించే అవకాశముందని, దీనిపై అవగాహన కల్పించాలని కోరారు.

షీటీం పై..

పాలకుర్తి(రామగుండం): రామగుండం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులతో మంగళవారం రామగుండం సీఐ ప్రవీణ్‌కుమార్, షీటీం ఇన్‌ఛార్జి మల్లన్న మాట్లాడారు. ఎవరైనా వేధింపులకు గురిచేస్తే మహిళలు 6303923700 నంబరుకు ఫోన్ చేయాలన్నారు. ఎవరైనా ఆన్‌లైన్ మోసాలకు గురైతే 1930కి సమాచారమివ్వాలని సూచించారు. షీటీం సిబ్బంది స్నేహలత, సురేష్, ప్రిన్సిపల్ మోహన్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

ఓదెల: పెద్ద కొమిరకు చెందిన నాగపురి శ్రీనివాస్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. స్థానిక హమాలీ కార్మికులు మంగళవారం అతడి కుటుంబానికి రూ.21 వేల ఆర్థిక సాయం అందజేశారు.

ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం

ముత్తారం: దరియాపూర్ ఆదర్శ పాఠశాలలో అయిదు పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ కృష్ణవేణి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. పీజీటీ గణితం, పీజీటీ వృక్షశాస్త్రం, టీజీటీ గణితం, హిందీ, తెలుగు పోస్టులకు పీజీ, బీఈడీ, టెట్ ఉత్తీర్ణులైన వారు అర్హులని, ఈ నెల 26లోగా దరఖాస్తులు చేసుకోవాలన్నారు.

విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఎంచుకోవాలి

సుల్తానాబాద్, న్యూస్‌టుడే: విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఎంచుకొని పట్టుదలతో సాధించాలని అదనపు కలెక్టర్ శ్యాంప్రసాద్‌లాల్ పేర్కొన్నారు. సుల్తానాబాద్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం ప్రథమ సంవత్సరం విద్యార్థులకు నిర్వహించిన స్వాగత సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. గతేడాది ఉత్తమ మార్కులు సాధించిన, క్రీడల్లో రాణించిన విద్యార్థులకు జ్ఞాపికలు అందజేశారు. విద్యార్థుల నృత్యాలు అలరించాయి. జిల్లా ఇంటర్ విద్యా శాఖ అధికారి కల్పన, తహసీల్దార్ మధుసూదన్‌రెడ్డి, ప్రిన్సిపల్ రామచంద్రారెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.


విద్యార్థినుల నృత్య ప్రదర్శన